


# నా పెళ్ళి

బత్తుల వెంకట దుర్గాప్రసాదరావు

అది స్త్రీల కౌంటర్.

దాని ముందున్న క్యూలో నేను ఉన్నాను.

క్యూ చాలా పొడుగ్గా వుంది.

"హలో!"

"అటు చూశాను.

"మీవి రెండు టిక్కెట్లా?" ఎవరో ఆమె నన్ను అడిగింది.

"ఒక్కటే!" నేను చెప్పాను.

"నాకొకటి తీసి పెట్టరూ?" ఆమె డబ్బులందిస్తూ చెప్పింది.

అప్రయత్నంగానే ఆ డబ్బులందుకున్నాను.

ఈ సినిమా హాలు వారు ఒక మనిషికి రెండు టిక్కెట్లు మాత్రమే ఇస్తారు!

ఆమె నా తర్వాత వారిని వాకబు చేస్తోంది-మరొక టిక్కెట్టు కొరకు అభ్యర్థిస్తోంది.

క్యూ నడుస్తోంది. క్యూలో నేనూ కదులుతున్నాను.

సినిమా ఈ మధ్య విడుదలైంది. 'బాగుంది' అనిపించుకుంది.

ప్రతి టిక్కెట్ కౌంటర్ వద్ద క్యూలు బారుగా వున్నాయి.

ఎటు చూసినా గోలగోలగా వుంది.

నా వంతు రాగానే రెండు టిక్కెట్లు తీసుకున్నాను.

ఆమె గేటుకు దగ్గరలోనే నిలబడి వుంది. ఆమె ప్రక్కన మరొకామె కూడా వుంది.

టిక్కెట్టు, మిగిలిన డబ్బులు ఆమెకు అందించాను.

టిక్కెట్టు చూసి "ఒక్క క్షణమాగుతారా?" అంది ఆమె.

ఆగిపోయాను.

కొద్ది సేపటికి మరొకరు వచ్చి ఆమెకు ఒక టిక్కెట్టు, చిల్లర అందించారు.

వారికి థాంక్స్ చెప్పి నాతో అంది ఆమె-" ఈ టిక్కెట్టు తీసుకొని మీ టిక్కెట్టు ఇస్తారా?"

ఆమె ప్రయత్నం నాకు అర్థమయింది. ప్రక్క ప్రక్క సీట్లను ఆమె కోరుకుంటోంది.

మరి ఆ రెండో వ్యక్తిని అడగలేదు.ఎందుకో?-అదే అడిగాను.

"మీవి విండో సైడ్‌వి. ప్లీజ్" చెప్పింది ఆమె.

మేము టిక్కెట్లు మార్చుకున్నాం.

ఆమె థాంక్స్ చెప్పింది.

నేనూ హాలులోకి నడిచాను.

మళ్ళీ ఆమె నాకు చాలా రోజుల పిమ్మట కనిపించింది పోస్ట్ ఆఫీసులో.

ఆమెను ఇట్టే పోల్చగలిగాను.

టెలిఫోన్ బిల్లు కట్టడానికి వచ్చింది.

నేను కౌంటర్‌లో వున్నాను.

నన్ను చూస్తూనే పలకరింపుగా నవ్వింది ఆమె.

"మీరిక్కడ జాబ్ చేస్తున్నారా?" అడిగింది ఆమె వెంటనే.

'ఊఁ' కొట్టాను.

ఆమె పని పూర్తిగానే థాంక్స్ చెప్పి వెళ్ళిపోయింది.

మళ్ళీ ఆమె నాకు మరికొద్ది రోజుల తర్వాత తారసపడింది.

ఈసారి పార్కులో-

నేనే పలకరింపుగా నవ్వాను.

"హలో నా పేరు తులసి...మీ పేరు?" ఆమె అడిగింది సింపుల్‌గా.

"నా పేరు స్నేహాంజలి" నేను చెప్పాను.

"మీరు ఎక్కడ వుంటున్నారు" తులసి అడిగింది.

నా అడ్రస్ చెప్పాను.

ఆమె అడ్రస్ నేనూ అడిగాను.

"ఇక్కడకు దగ్గరే" అంటూ తులసి తన

అడ్రస్ చెప్పింది.

మేము నడుస్తున్నాం పార్కు మధ్యకు.

"మీరు నాతో వచ్చేస్తున్నారు" తులసి అంది ఆగిపోయి.

మెల్లగా అడిగాను "ఏమైనా ఇబ్బందా?"

"భలేవారే! రండి. అలా కూర్చుందాం" అంది తులసి ఈజీగా.

ఓ చెట్టు క్రింద మేము ఎదురెదురుగా కూర్చున్నాం.

"మీది రేర్ వాయిస్. మీరు పాటలు పాడితే బాగుంటుంది. మీరు సంగీతం నేర్చు..."

"కున్నాను" తులసికి అడ్డుపడి చెప్పాను నేను.

"ఈజిట్. రియల్లీ మీ వాయిస్ వెరైటీగా వుంటుంది" తులసి అంది గమ్మత్తుగా.

చిన్నగా నవ్వేశాను. పిమ్మట లోకాభిరామాయణంలో పడ్డాం.

ఒక రోజు ఫోన్ చేసి చెప్పాను తులసికి - ఆఫీస్‌లో ఓ కార్యక్రమంలో నేను పాడబోతున్నానని, ఆమెను రమ్మనమని.

ఆమె ఆ ఫోన్‌లోనే తన సంతోషాన్ని, అడ్వాన్స్‌డ్ అభినందనలు తెలియచేసింది.

ఆ కార్యక్రమానికి వచ్చింది. నా పాటలు విని, నన్ను మెచ్చుకుంది. నన్ను తనింటికి ఆహ్వానించింది.

నేను "అలాగే వస్తాను. వచ్చే ముందు ఫోన్ చేసి చెప్తాను" అన్నాను.

ఆమె సరదాగా ఇంటికి వెళ్ళిపోయింది.

ఒక ఆదివారం వాళ్ళింటికి వెళ్ళాను.

తులసి తన వాళ్ళు అందరికీ నన్ను పరిచయం చేసింది.

ఆమె ఇంటి ఇరుగు పొరుగు వారు అంతా వచ్చారు! నా పాట వినడానికి కుతూహల పడ్డారు.

నేను నవ్వేశాను హోల్సీగా.

అంతా వత్తిడి చెయ్యడంతో రెండు కీర్తనలు, ఒక సినిమా పాట పాడాను.

అంతా నన్ను మెచ్చుకున్నారు. అభినందించారు.

గంటకు పైగా అక్కడ హ్యాపీగా కాలం గడిపి, తిరిగి ఇంటి మొహం పట్టాను.

కొన్ని రోజుల తర్వాత-

ఆ రోజు సెలవు దినం కావడంతో ఆఫీస్‌కు పోయే అవసరం లేదు. తులసి వాళ్ళింటికి వెళ్ళాను.

తులసిని చూసుకోవడానికి పెళ్ళి వారు వచ్చి వున్నారు అక్కడ.

నేను వెంటనే తిరిగి ఇంటికి వచ్చేయాలనుకున్నాను. కానీ తులసి కోరిక మేరకు నేను ఉండిపోయాను.

పెళ్ళి చూపుల కార్యక్రమం ముగిసింది.

పెళ్ళి కొడుకు బాగానే వున్నాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు.

తిరిగి నేను లోపలికి తులసి వాళ్ళతో కలిసి వచ్చేశాను ఆ హాలులో నుంచి.

హాలులో పెద్దల మధ్య మాటలు ఇంకా సాగుతున్నాయి.

హాలు ప్రక్క గదిలో తులసితో పాటు నేనూ వింటున్నాను వాళ్ళ మాటలు.

"మనం అనుకున్న డబ్బు మొత్తం పెళ్ళికి వారం రోజులు ముందుగా ఇచ్చేయాలి" అన్నారు పెళ్ళి కొడుకు తండ్రి.

"అలాగే" అన్నారు తులసి తండ్రి.

అంతలోనే తులసి తొందరగా అక్కడకు వెళ్ళి కలగజేసుకుంది. "వద్దు వద్దు. మొత్తం డబ్బు ఒక్కసారిగా ఇవ్వవద్దు" అని చెప్పింది.

నేనూ హాలులోకి వచ్చేశాను.

"అమ్మా తులసీ..."గాభరాగా అన్నారు తులసి తండ్రి.

"అవునండి. మొత్తం డబ్బు ఒకేసారి ఇవ్వవద్దు" అని తిరిగి చెప్పింది తులసి.


"ఏమిటమ్మా నువ్వు చెప్పేది?" అడిగారు పెళ్ళి కొడుకు తండ్రి.

"మొత్తం డబ్బు నా పేరన బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్ చెయ్యబడుతుంది. నెలనెలా దాని వడ్డీ డబ్బులు మీ అబ్బాయికి మాత్రమే అందుతాయి.

## అద్భుతం

భారీ సెట్టింగులతో
కెమెరా జిమ్మిక్కులతో
టెక్నికలర్‌లో తీసిన
దేవదాసు చిత్రం జీవితం.
గెలుపులు ఓటములు
సత్యాలు అసత్యాలు
ఎన్నటికీ పరిష్కారం కాని
కోర్టు వ్యాజ్యం జీవితం.
మమతలు మమకారాలు
తెగని రక్తపాశాలు
కంఠస్థం చేసినా
అక్కరకు రాని పద్యం జీవితం.
ప్రేమల హిమవర్షం
ఈర్ష్యల అగ్ని నగం
ఆకలి పన్నిన పద్మవ్యూహం
ఆగని ఆశల జలపాతం జీవితం.
తాడు నుండి జారిన బొంగరం
తరాలు బిగించిన సాంఘిక చక్రం
నిరంతర తరంగా క్రోశం
కోరిక వదలని జ్వరం జీవితం.
సుఖదుఃఖావేశాల సుడి గుండం
ఆనంద విషాద బాష్ప ప్రవాహం
కొత్తగా వుంటూనే విసిగించే
తెలుగు సీరియల్ జీవితం.
అలసిపోతూనే సాగించే ప్రయాణం
తల తప్ప తోకలేని విమానం
జీవితం మనిషి మోసే వాహనం
జీవితం మనిషిని మోస్తున్న అసహనం
అందుకే జీవితం
సహజ అసహజాల ప్రియ సంతానం.

**- యస్.మునిసుందరం**



నా తదనంతరం ఆ ఫిక్సిడ్ డిపాజిట్ మొత్తం, మైనారిటీ తీరిన మా పిల్లలకు ముడుతుంది. ఈ లోగా నాకు ఏదైనా జరిగినా, పిల్లలు కలగకపోయినా, నా కన్నవారి ఇష్టప్రకారం ఆ మొత్తం వినియోగింపబడుతుంది. వీటికి ఒక రిజిష్టర్ ఎగ్రిమెంట్ రాసుకోవాలి" చెప్పింది తులసి గడగడా.

నేను అబ్బురంగా వింటున్నాను.

"ఆ మొత్తం డబ్బు స్త్రీ ధనంగా రాయబడుతుంది" వెంటనే చెప్పింది తులసి.

"విడ్డూరంగా వుంది. ఏమిటీ కొత్త మడతలు, మతలబులు" అన్నారు పెళ్ళి కొడుకు తండ్రి.

"అలా కాకపోతే సెక్యూరిటీ ఏది?" అంది తులసి.

పెళ్ళి కొడుకు ఒక ప్రేక్షకుడిలా కూర్చున్నాడు.

"ఏంటమ్మా నీ అనుమానం? ఎక్కడో జరిగాయని అన్ని చోట్లా అత్తింటి పోర్లు, చావులు కోడళ్ళకు వుంటాయా?" అన్నారు మధ్యవర్తి కల్పించుకొని.

"చూడండి! నా ఆత్మాభిమాన రక్షణ కోసం, నా ఉనికి పరిరక్షణ కోసం నా సాఫీ మనుగడ కోసం, వేధింపులు, అరాచకాలు లేకుండా వుండడం కోసం ఉన్నది పుష్టి అనే నమ్మకం కోసం నేను ఖచ్చితంగా ఈ నిర్ణయం తీసుకున్నాను" అంది తులసి సూటిగా.

"నీ చదువుల మాటలు ఎందుకమ్మా? పుస్తకాలలో, మైకులలో అవి ముచ్చటగా ఉంటాయి" అన్నారు పెళ్ళి కొడుకు తండ్రి.


చదువుల వలనే కాదు, నా చుట్టూ పరిసరాల అనుభవాల వలన నేను ఇలా కోరుకుంటున్నాను" చెప్పింది తులసి.

"ఏమైనా డబ్బు ఏదొక రూపంలో ఇస్తున్నాం కదమ్మా" అన్నారు రాజీ ధోరణిలో తులసి తండ్రి.

"కావచ్చు. నా విశ్లేషణ ఏమిటంటే ఒకేసారి పూర్తి మొత్తంలో డబ్బు ఇవ్వడం వలన అది ఏదో ఖర్చుకు తక్కువ టైంలో ఖర్చు అయిపోతుంది. పైగా ఆ మొత్తం అత్తింటి వారందరూ, వాళ్ళ అవసరాలకు వాడుకోవచ్చు.

కానీ డబ్బు ఇస్తున్నది నా సుఖం కోసం, నా భర్త కోసం, మా పిల్లల కోసం. ఒకేసారి మొత్తం డబ్బు ఇచ్చేస్తే, మరి మాకు అది ఎంత మేరకు అందుతుందో చెప్పండి.

నెలనెలా డబ్బు ఇవ్వడం వలన నేను 'బంగారు బాతు'నవుతాను. అపురూపంగా చూడబడతాను. పైగా ఇలా నెలనెలా ఇచ్చే డబ్బుతో ఒప్పుకున్న కట్నం మొత్తం డబ్బు కంటే ఎక్కువ డబ్బే ముడుతుంది కూడా" చెప్పింది తులసి చాలా నిదానంగా.




ఇటీవల విజయవాడలోని "బెజవాడ యువకలాలు" ఆధ్వర్యంలో చలపాక ప్రకాష్ రాసిన "ప్రేమపోరాటం" నవలని ప్రముఖ రచయిత కొమ్మూరి వేణుగోపాలరావు ఆవిష్కరించారు. సాహితీ వేత్త వేముల హజరత్తయ్య, పత్రికా రచయిత డి. చంద్రశేఖర్‌లని కూడా చిత్రంలో చూడవచ్చు.

"ఎందుకమ్మా కంఠశోష. నీది ఒట్టి చోద్యం. ఆఁ. ఇది జరిగే పనేనా?" అన్నారు పెళ్ళి కొడుకు తండ్రి విసుగ్గా.

"ఇలాగైతే పెళ్ళిళ్ళు అయ్యేటట్టే" అన్నారు మధ్యవర్తి చిరాగ్గా.

తులసి తండ్రి ఏదో చెప్పబోయారు.

అంతలోనే "నా భావాలను గౌరవించే వ్యక్తే నాకు భర్తగా కావాలి. ఆ అనుకూల దాంపత్యాన్నే నేను కోరుకుంటున్నాను. ఎప్పుడైతే, ఎవరైతే నా ప్రపోజల్‌కు ఒప్పుకుంటారో అప్పుడే, వారితోనే నా పెళ్ళి జరిపించండి నాన్నా! లేదా నా పెళ్ళికని మీరు నాకై కొంత డబ్బు హెచ్చించడానికి సిద్ధపడి వున్నారుగా. దానిని నేను ఒక సరళమైన వ్యాపారానికి పెట్టుబడిగా పెట్టుకొని జీవించగలను" అంది తులసి.

ఆమె తల్లిదండ్రులు ఆందోళనగా చూస్తున్నారు తులసి వంక.

"అవునండీ! మీరూ ఆలోచించండి. మన ఇంటిలో అక్క, ఆ రామారావు అంకుల్ కూతురు గిరిజ, అలాగే మన జయంతి పెళ్ళిళ్ళు చేసుకుని అత్తింటి పోరులు, భర్తల గొంతెమ్మ కోరికలతో ఎన్ని బాధలు పడ్డారు, పడుతున్నారు. ఎందుకు అనేది మీకు తెలుసు!

ఆ డబ్బు మొత్తాలు కాస్తా ఖర్చైపోగానే పేచీలు మొదలవుతున్నాయిగా. నాకా పరిస్థితి వద్దు.

సంసారం పేరుతో ప్రేమానురాగాలను కొనుక్కొనే పద్ధతులు మనవి. అప్పటిలో ఆ పద్ధతులు గౌరవంతో ఒక హద్దులో ఆగిపోయేవి. కానీ ఇప్పుడు అవి స్వార్థంతో హద్దులు దాటిపోతున్నాయి.

నేను వాటిని ఎదిరించలేను. వదులుకోలేను. కనుకనే వాటిని నేను ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతిలో కోరుకుంటున్నాను. ఆశిస్తున్నాను. పెద్దలు నా మాటలు మన్నించాలి" అంటూ తులసి చెప్పడం ఆపింది.

వెనువెంటనే "మీ సంబంధం మాకు వద్దు. నమస్కారం! సెలవు!" అంటూ ఆ పెళ్ళి వారు వెళ్ళిపోయారు.

నేనూ తిరిగి వచ్చేశాను మా ఇంటికి. కానీ ఆలోచనలు నన్ను వదలలేదు.

తులసిలా ఎంతమంది ఆలోచించగలరు? ఆ భావాలకు ఎంతమంది వత్తాసు వుంటుంది?

తులసి భావాలు నాకు నచ్చాయి. ఆమె విశ్లేషణ బాగుంది.

తులసిని మనస్ఫూర్తిగా అభినందించాలి. ఆమెను అనుసరించాలి.

మంచం మీద మేను వాల్చాను. వెంటనే ప్రశాంతంగా నిద్రపోయాను.

కాల చక్రం గిర్రున తిరిగింది.

పెళ్ళితో నేను రాష్ట్రం మారాను.

మా అత్తగారు అవగాహన కలవారు నా కన్నవారి వలె. శ్రీవారు మా మంచి భావాలు కలవారు.

నా కాపురం చక్కగా వుంది.

మాకు మూడేళ్ళ పాప వుంది. పాపకు 'తులసి' అని పేరు పెట్టాం.

కానీ, వ్యాపార రంగంలో అడుగు పెట్టి మంచి స్థితిలో వున్నప్పటికీ, నేటికీ నా ఆదర్శ తులసికి పెళ్ళి కాకపోవడం నాకు వెలితే!

ఆదర్శం నిలవడానికి ఆసరా ఆదరణే కదా!

మచ్చుకు నా పెళ్ళి. ❀